# మళ్లీ చివరికి మొదలు

అవసరం అరుస్తున్నట్టు ఉరుముతోంది ఆకాశం. యజమాని మొహంలా ముసముసలాడుతోంది నల్లమబ్బు. టెలిఫోన్ మీద వచ్చిన అప్పులవాడి హెచ్చరికలా గద్దించిపోతోంది మెఱుపు.

చంద్రమౌళి నడుస్తున్నాడు. దిక్కులు చ ఊస్తూ నడుస్తున్నారు. భయం భయంగా ఉంది మనసు. బెరుకు బెరుకుగా వుంది చూపు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

ఒక వరుసలో బస్‌స్టాపులు. తన స్టాప్ వచ్చింది. ఆగేడు ఈ పక్కగా ఒక వరసలో పళ్ళదుకాణాలు. భార్య స్వరూప మాట గుర్తుకొచ్చింది. 'అత్తయ్యకి దానిమ్మపండు మంచిదిట. షుగర్‌వాళ్లు తినాలిట. వీలైతే తీసుకురండి". రోజూ చెప్తుంది. రోజూ వింటాడు. రోజూ ఖాళీ చేతుల్తో వెళ్తాడు. నూటికో కోటికో ఒక రోజు నాలుగు అరటిపళ్ళు అందిస్తాడు. భార్యా భర్తా కొడుకూ కూతురూ! కొడుకు సుధాకర్‌కి యాపిల్ ఇష్టం. కూతురు కరుణకి ద్రాక్ష కావాలి. స్వరూపకి నిజానికి కమలా ఇష్టం. అమ్మకి అందని మ్రాని పండు. తనకు? ఆలోచనలో అనేకానేకం!

అడిగాడు, దానిమ్మ – ఒక్కటీ ఇరవై రూపాయలు! గుండె చిక్కపట్టింది. నిట్టూర్పు కూడా బిక్కచచ్చిపోయింది. కాలు కదిలింది.

ఎవరో అదిలించాడు. నెట్టుకుపోతున్నాడు. చూశాడు. బండి దగ్గరకి చేరాడతను. తిండి. మైసూర్ బజ్జీలు, బండి చుట్టూ జనమే జనం. పక్కన ట్రాన్ ఫార్మర్. దాన్ని ఆనుకుని మునిసిపాలిటీ వారి చెత్తకుండీ. కుండీలో – ఉన్నదానికంటే – చుట్టూ ఉన్నదే – అధికం. అది కంపు పంచును. నీవు మురికి చేయుము?' నవ్వుకున్నాడు.

ఎదురుగా చౌరస్తా. కళకళలాడిపోతోంది. వెలుగు ముద్దలా జిగేల్‌మంటోంది. మాల్స్! షోరూమ్స్! స్టోర్స్! నోట్ల ఆకులన్నీ కోసి, నూరి, ముద్ద చేసి, దాన్లో ఇన్ని ఆకర్షణలు వెన్నెల చినుకులు చల్లి – ఈ బిల్డింగ్‌ల మీదా, ఈ మనుషుల మీదా 'వైట్ వాష్' చేశారా అనిపిస్తోంది.

ఎటు చూసినా జనం. జనం! ఎక్కడ చూసినా వ్యాపారం! డబ్బు...డబ్బు చేతులు మారుతోంది. ఎక్కడ నుంచీ వస్తోంది?

ప్రైవేట్ కాలేజీ లెక్చరర్ బుర్రకి అందదు– సమాధానం! ఎకిటెన్స్‌లో అంకెకీ, చేతిలో నోట్లకీ పొంతనలేని జీతగాడి తెలివితేటలు – ఈ గణాంకాల రహస్యాల్ని పట్టుకోలేవు!

ఆలోచన పరుగుని బుద్ధి హెచ్చరించింది. ఇంట్లో అమ్మా, పెళ్ళాం పిల్లలు కళ్ళముందు నిలిచారు. తల విదిలించుకున్నాడు మౌళి.

చూపు బస్‌ని వెతికింది. అదిగో వచ్చేస్తోంది.... వచ్చేస్తోంది వన్‌జీరో సెవెన్!

పరిగెత్తుకుంటూ పోయి బస్‌ని అందుకున్నాడు. వెనకనుంచీ – ఒక్క పెట్టున వర్షం దాడి చెయ్యనే చేసింది.

ఇల్లు–

స్వరూప ఆహ్వానంపు చిరునవ్వు. అమ్మ మూలుగు – తడిసిపోయావురా. తలతుడుచుకో ముందు. పిల్లల మూగచూపులు, మౌనహాసం. హోమ్‌వర్క్ ప్రెజర్!

కాఫీ! ప్రాణానికి హాయిగా ఉంది.

పిల్లలతో కాసేపను మాటల విహారం. స్కూల్ డిమాండ్లు. తమ కోరికలు, కిచెన్‌లోంచి స్వరూప అదిలింపులు.

స్నానం అయింది. అందరికీ హాలు, హాలులో టీవీ. ఫిలిప్స్ బ్లాక్ అండ్‌వైట్. అందునా పోర్టబుల్. 'పిల్లలు అట్టాగే ఉంటారు గానీ, మీరేం ఆలోచించకండి. ఇది చాలు' స్వరూప హెచ్చరిక.

'కూరలు మండిపోతున్నాయండీ. పావుకిలో బెండ ఏడురూపాయలు. కీరకాయలే కిలో ఇరవైట. టమోటో పదహారు...' అడిగింది. దినపత్రికలో మార్కెట్ రేట్లు కళ్ళల్లో కదలాడినై మౌళికి. అవి పదకొండు, పదీ, ఎనిమిదీ.. ఇలా వుంటై. బతుకులో దళారీతనం అనివార్య భాగమైపోయింది. జీతం రాళ్ళు గుర్తుకొచ్చాయి. పదే పదే ప్రిన్సిపాల్ కమ్ సెక్రటరీ అనే మాట గుర్తుకొచ్చింది. 'మీరు పిహెచ్‌డీ త్వరగా చేసేయాలి మాష్టారూ....' భోజనాలు అయినై.

పిల్లలు పడుకున్నారు. హాల్లో వున్నారు ముగ్గురూ తల్లీ ఆమె కొడుకూ, కోడలూ! పప్పులన్నీ మళ్లీ బాగా పెరిగిపోతున్నాయండీ. కందిపప్పు అరవై ఆరునుంచీ మళ్లీ

డెబ్బై అయిదుకు పోయింది. మినపప్పు అంతే'. స్వరూప చెప్తున్నట్టూ, తనకు తానే చెప్పుకుంటున్నట్టూ చెప్పుకుపోతోంది. మౌళి పరధ్యానంగా ఏమీ లేడు. విన్నాడు. అతని బుర్రలో అంకెలు, అంకెల ఎగుడుదిగుళ్ళు!

– ఫోన్ మోగింది.

తీశాడు మౌళి. స్పీకర్ని ఆన్ చేశాడు. విజయవాడ నుంచీ విశ్వం. మౌళి అన్నయ్య కుశల ప్రశ్నలూ, పరామర్శలూ, ముగ్గరే వింటున్నారు. ముఖకవళికలు మారసాగేయి.

ఫోన్ కట్ అయింది.

"వాళ్ళ అత్తగారికి బాగాలేదు. హాస్పటల్లో వుందిట. ఆమె బాధ్యతంతా వీళ్ళదే కదా. కూతురు శిరీషని ఇంటర్ కమ్ ఎమ్సెట్లో చేర్చాలిట. వదినమళ్లీ ప్రెగ్నెంట్ట. ఆమె ఆరోగ్యమూ బాగా లేదట."

ముగ్గురూ విన్న సంగతుల్నే పునర్వచించాడు మౌళి.

మౌళి మాటల్లో అసహనం తల్లికీ తెలుసు, భార్యకీ అర్థమయింది. బావగారు అడిగాందీ, మౌళి చెప్పనిదీ కూడా గుర్తుంది స్వరూపకు. 'డబ్బు'! 'డబ్బు కావాలి'! 'ముగ్గురు పిల్లలూ, పూట పూటకీ పొయ్యిలో పిల్లి లేస్తుందో లేదో తెలీని సంసారం. మళ్ళీ నీళ్లోసుకుంది. అక్క!' అక్కని తలుచుకుంటే బాధ కలిగింది. స్వరూపకి. ఈ విషయంలో నన్నా కొంచెం జాగ్రత్త వుండొద్దూ అనిపించింది.

కొడుకునీ, కోడల్నీ చూస్తూ అన్నది తల్లి 'ఆ సంసారం అంతే ఇక. వాడికి బాధ్యత తెలీదు. ఆ పెళ్ళాంకి వచ్చేది చాలదు'.

"అవును. ఇక్కడ మనకే వచ్చేది చాలుతోంది. ఎక్కువైపోతోంది. అందరికీ సహాయాలు చేయడానికి" విసుగ్గా అని లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు మౌళి. తల్లీ కోడలూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

రాత్రి దిగులుగానే జారుకుంది.

– తెలతెలవారుతుండగానే వచ్చింది సుశీల. మౌళి చెల్లెలు. ఆమె ఉండేది గుంటూరులో.

కాఫీలయినై. కూర్చున్నారు. సుశీల మొదలెట్టింది.

"మీ బావ ఎక్కడికి వెళ్ళారో తెలీదురా మౌళీ. పదిహేనురోజులైంది" స్వరూప భర్త మొహంలోకి చూసింది.

"ఇదేం కొత్త కాదుగా" అంది తల్లి.

"మనిషి ఉన్నాడంటే అదో పద్ధతి. లేకపోతే ఊళ్ళో వాళ్ళూ, అప్పులవాళ్ళూ కాకుల్లా పొడుస్తుంటారు. దానికి తోడు ముగ్గురు పిల్లల తల్లినయినా నిండా ముప్ఫై ఏళ్ళు నిండని ఆడదాన్ని కదా. మగపక్షుల చూపులన్నీ నా మీదే. వెర్రోడి పెళ్లాం వాడకంతా మరదలే అన్నట్టు" ఈ మాటలంటూనే వర్షించింది సుశీల.

"ఆ ఏడుపెందుకూ? నెత్తిన నీళ్ళకుండ సిద్ధం" తల్లి విసుక్కుంది. మౌళికీ, స్వరూపకూ ఏమనాలో తెలీలేదు.

స్వరూప ఆడబిడ్డ దగ్గరగా సావెళ్ళి కూర్చుంది. ఆమె భుజంమీద చేయివేసింది. అనునయంగా, సుశీల దుఃఖం ఇంకా ఎక్కువైంది. "రాముడు పరిస్థితీ ఏం బాగా లేదురా. చదువులేదు. జులాయి తిరుగుళ్ళు, మేనల్లుడిని నువ్వే బాగుచెయ్యాలి. వాడినో దారిలో పెట్టే బాధ్యతని మీకు అప్పగించాలనే వచ్చాను."

మౌళికి తెలుసు. చెల్లెలు ముంతదాస్తోంది. అభిమానవతి. మరదలు ముందు నోరు తెరిచి అడగలేకపోతుంది. దానికితోడు అమ్మ నోరన్నా భయమే. రాముడి కథ అసలు వ్యవహారం కాదు. అది ఉపాఖ్యానం అంతే. సుశీల భర్త - పార్థు - గుర్తొచ్చాడు. ఏవో టూరిస్ట్ బస్‌ల మీద తిరుగుతూ వుంటాడు. బలాదూరంమనిషి. అన్నిరకాల వ్యసనాలూ ఉన్నాయంటారు. సుశీల టైలరింగూ, ఒకటి రెండు క్లాసుపిల్లల ట్యూషన్లే ఆ కుటుంబం భుక్తి. రింగూ, ఒకటి రెండుక్లాసు పిల్లల ట్యూషన్లే ఆ కుటుంబం భుక్తి.

"నాన్నచనిపోయేముందు మహామంచి సంబంధం చేశాడు దీనికి" అనిపించింది. మనసులోనే చిరాకు పడ్డాడు.

"ఎనిమిది దాటింది" అంటూ లేచింది స్వరూప. మౌళి కూడా తన కార్యక్రమాల్లోకి కదిలాడు.

అన్నా వదినల మౌనాన్ని ఏ విధంగానూ అర్థం చేసుకోలేకపోయింది" సుశీల. మనసు పరిపరి విధాల ఆలోచనల్లోకి పరిగెత్తుతోంది. లేచి తల్లి దగ్గరికి నడిచింది.

- ఆరాత్రి,

చాలా ఆలస్యంగా ఇల్లు చేరాడు మౌళి.

భోజనాలయినై.

హాల్లోనే కూర్చునివున్న సుశీల దగ్గరగా వెళ్ళి "ఇంతకంటే నేనేం చెయ్యలేనే సుశీలా. రాముడినీ ఇక్కడికి తెచ్చి వుంచుకునే పరిస్థితి లేదు. పార్థు వచ్చిన తర్వాత నేనే వచ్చి మాట్లాడుతాను" అని, అప్రయత్నపూర్వకంగా, సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాడు మౌళి. చేతిలోని డబ్బుని ఆమెకిచ్చాడు. నిమ్మళంగా అడుగు కదిల్చి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఎంతేమే ఆ డబ్బు?"అడిగింది తల్లి. ఆఎమెని కొరకొరా చూసి, "ఎంతో కొంతలే. అన్నీ ఆరాలు" అని విసుక్కుంది సుశీల. హాల్లో లైట్‌తీసి గదిలోకి వెళ్ళింది స్వరూప.

రూమ్‌లో ఉన్న ఫోన్‌లోనుంచి మాట్లాడసాగాడు మౌళి. "పరిస్థితులేం బాగా లేవన్నయ్యా, ప్రస్తుతం నేనున్న స్థితిలో వెంటనే మీకేమీ హెల్ప్ చేయలేను. అప్పు పుట్టలేదు. ఏమనుకోకు అని, స్వరూప వైపు చూశాడు.

స్వరూపకి అక్క గుర్తుకొచ్చింది. మనసు గిలగిలలాడింది. కానీ తామున్న పరిస్థితుల్లో వేరే మార్గాంతరమూ, కనిపించలేదు.

పరిశీలనగా భర్త మొహంలోకి చూసింది. అతనేదో యాతనలో వున్న మనిషిలా కళ్లు మూసుకుని వున్నాడు. పలకరించటానికి ధైర్యం చాలక మిన్నకుంది సుశీల.

నాలుగు రోజులు కూడా కాలేదు.

అపరాత్రి -

సీలింగ్‌కి తిరుగుతున్న ఫ్యాన్‌ని చూస్తూ పడుకుని వున్నాడు మౌళి. అతని పక్కన స్వరూప.

"ఏమన్నా జరిగిందా? అట్టా వున్నారేం?" అంతఃకరణలోని ఆప్యాయతని పదాల స్పర్శలో మేళవించి అడిగింది.

కొన్నిక్షణాల పాటు సమాధానమేమీ ఇవ్వలేదు మౌళి. ఆ తర్వాత, గొంతు పెకల్చుకుని అన్నాడు. "మా కాలేజీని అన్ని పర్మిషన్‌లూ లేకుండానే నడుపుతున్నారట. ప్రభుత్వం చర్య తీసుకుంటోందట".

గుండె గుభిల్లుమంది స్వరూపకు. భర్త కళ్ళల్లోకి చూసింది. తెలిసీ తెలియనట్టుగానే అంతా అర్థమవుతుందామెకు.

"నోటీసిచ్చారు."

ప్రభుత్వం యాజమాన్యానికీ, యాజమాన్యం సిబ్బందికీ – అని తెలుస్తోంది.

మూలిగే నక్కమీద తాటికాయ పడుతోంది.

చంద్రమౌళి, ఎం.ఏ., ఎం.ఫిల్!

కళ్ళముందు కలగాపులగంగా అనేక దృశ్యాలు... అనుకున్నదానికీ, ఉన్నదానికీ మధ్య నెర్రెలు విచ్చిన నేల! చెట్లు కూలుతున్న కిరకిర!

భార్యాభర్తల మధ్య తెగిపడుతున్న ఊహలూ, వాస్తవాలూ! రాత్రి గడుస్తోంది. చీకటి... చీకటిగా...

అక్కడ విద్యార్థుల గతి...??

వెలుగు రావటానికి ఇంకా సమయం వుంది!!!

**–చినుకు మాసపత్రిక, మే 2010**